క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడికి సత్కారం



మురళీధరరెడ్డిని సత్కరిస్తున్న తెలంగాణ ఉద్యోగులు

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఏ.మురళీధరరెడ్డిని తెలంగాణ ప్రాంత ఉద్యోగులు శనివారం ఘనంగా సత్కరించారు. ఫేజ్–6 గ్రీన్‌లాండ్ కాలనీలో జరిగిన సత్కారసభలో ఆయన సేవలను కొనియాడారు. ఉద్యోగుల సంఘం నాయకులు ఎస్.కుమారస్వామి, ఆనంద్, వెంకటేశ్వర్లు, మల్లేష్, చంద్రకిరణ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, యూత్ సభ్యులు

కూర్మన్నపాలెం: జాతీయ పౌష్టికాహార దినోత్సవాన్ని శనివారం కణితి రామాలయంలో మేజిక్ బస్సు సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు తమ ఇళ్ల నుంచి వంటలు తీసుకొచ్చి ప్రదర్శించారు. వక్తలు పౌష్టికహార ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.నర్సింగరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణరావు, ప్రసన్నాంభ, బస్సు మోనటరింగ్ అధికారి సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెళ్లిరా.. వినాయక



కోలాటం చేస్తున్న చిన్నారులు

పెదగంట్యాడ: మండలంలో కొలువుదీరిన గణనాథులు ప్రత్యేక పూజలు అందుకున్నారు. శనివారం సాయంత్రం మేళతాళాలు, కోలాటాల నడుమ బయలు దేరిన ఉత్సవ మూర్తులు గంగమ్మ ఒడికి చేరాయి. జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కు ధర్మాలవీధిలో పెంటమాంబ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిమజ్జనం అట్టహాసంగా నిర్వహించారు. పిట్ట రమణ, ధర్మాల ఎల్లయ్యరెడ్డి, ధర్మాల రామిరెడ్డి, గొందేశి సుమన్ రెడ్డి, గొందేశి అప్పలరెడ్డి,బసా అప్పలరెడ్డి ఆధ్వర్యంలో మేళ తాళాలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య గణపతిని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం యారాడ తీరంలో నిమజ్జనం చేశారు.

- జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులో బ్లూ డైమాండ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి మహోత్సవాలు ముగిశాయి. నిమజ్జనం సందర్భంగాచిన్నా పెద్దా తేడా లేకుండా సందడి చేశారు. శోభాయాత్రలో పలు కోలాట బృందాలు అలరించాయి.

సిరులతల్లికి తులసిపూజ



తులసిపూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచా మృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వ హించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపా రు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్ సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.రాజేంద్ర కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలతో విలవిల



చెత్తను భుజిస్తున్న ఆవులు, పందులు, కుక్కలు



కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

- క్షీణించిన పారిశుధ్యం
- వాతావరణ మార్పులతో ప్రబలుతున్న రోగాలు
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- కానరాని ఫాగింగ్, పరిశుభ్రత కార్యక్రమాలు

రోగాలు ప్రబలుతున్నాయి.. జ్వరాలు విజృంభిస్తున్నాయి.. ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి.. వాతావరణంలో వచ్చిన మార్పులతో పాటు పారిశుధ్యం క్షీణిస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఎక్కడికక్కడ వర్షపునీరు నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెంది రోగాలను వ్యాప్తి చేస్తున్నాయి. మండలంలోని నడుపూరు, దయాల్‌నగర్, సిద్ధేశ్వరం, గిరిజా కోలనీ, గంగవరం, బర్మాకాలనీ, వెంకన్నపాలెం, యాతపాలెం, మదీనాబాగ్, పాలవలస, పిట్టవానిపాలెం, దేవాడ తదితర ప్రాంతాల్లో అత్యధికంగా జ్వరాలతో బాధపడుతున్నారు. జ్వర పీడితులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి.

– పెదగంట్యాడ



పెదగంట్యాడ పీహెచ్‌సీ వద్ద రక్త పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



గంగవరం యూపీహెచ్‌సీ వద్ద..

దోమల దండయాత్ర

పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. దీంతో దోమలు జనంపై దండయాత్ర చేస్తున్నాయి. గత నెలతో పాటు ఈ నెల మొదటి వారంలో భారీ వర్షాలు పడ్డాయి. దీంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్‌లో కూడా కురుస్తున్నాయి. వాతావరణం చల్లబడడంతో జ్వరాలు సోకుతున్నాయి.కీళ్ల నొప్పులు, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలతో అల్లాడుతున్నారు.

సమస్యల వలయంలో హెల్త్ సెంటర్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలు నిర్వహించి.. ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా చర్యలు చేపట్టేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పాడిన నాటి నుంచి వైద్య రంగాన్ని పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. 65వ వార్డు గిరిజాకాలనీ యూపీహెచ్‌సీలో వైద్యాధికారి 6 నెలల నుంచి లేరు.

ఫాగింగ్ ఊసే లేదు

కూటమి ప్రభుత్వం పారిశుధ్యం నిర్వహణలో పూర్తిగా విఫలమైంది. వర్షాకాలంలో దోమల లార్వా దశలోనే ఉంటాయి. ఆ లార్వా కాస్తా దోమగా మారకముందే నివారణ చర్యలు చేపడితే దోమల సంతతిని అరికట్టే అవకాశం ఉంటుంది. అయితే అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. బ్లీచింగ్, స్ప్రే, ఆయిల్ బాల్స్ ద్వారా నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమల సంతతిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో దోమలు వృద్ధి చెంది రోగాలను వ్యాప్తి చేస్తున్నాయి. ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాల్లో మాత్రమే ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు.

వివరాలు ఇలా..

- గంగవరం యూపీహెచ్‌సీకి రోజూ వచ్చే రోగుల సంఖ్య 120 వరకూ ఉంటుంది. అందులో జ్వర పీడితులు 35 వరకూ ఉంటున్నారని వైద్యాధికారి సాయినాథ్ తెలిపారు.
- దేవాడ పీహెచ్‌సీకి రోజు 120 వరకూ వచ్చే రోగుల్లో జ్వర పీడితులు 30 మంది వరకూ ఉంటారని వైద్యాధికారి ప్రదీప్ ప్రసాద్‌రాజా తెలిపారు.
- పెదగంట్యాడ పీహెచ్‌సీలో రోజుకు 120 వరకూ ఓపీ నమోదు కాగా అందులో జ్వర పీడితుల సంఖ్య 20 వరకూ ఉంటుందని వైద్యాధికారి సంపత్‌బాబు తెలిపారు.
- సిద్ధేశ్వరం యూపీహెచ్‌సీలో 90 ఓపీ నమోదు కాగా అందులో 30 వరకూ జ్వర పీడితులు ఉంటారని వైద్యాధికారి మానస తెలిపారు.
- నమ్మిదొడ్డి పీహెచ్‌సీలో ఓపీ 70 వరకూ ఉంటుంది. అందులో జ్వర పీడితులు 15 వరకూ ఉంటారని వైద్యాధికారి భవ్య తెలిపారు. ఇక ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లను ఆశ్రయించే వారి సంఖ్య భారీగా ఉంటుందని ప్రజలు చెబుతున్నారు.

భారీగా పెరిగిన ఓపీ



పెదగంట్యాడ పీహెచ్‌సీ ఓపీ వద్ద బారులు తీరిన జ్వర పీడితులు

మండల పరిధిలోని నాలుగు యూపీహెచ్‌సీలు, రెండు పీహెచ్‌సీలు ఉన్నాయి. ఒక్కో ఆస్పత్రికి జ్వర పీడితులు 10 నుంచి 30 వరకూ వచ్చి చికిత్స పొందతున్నారు. పెదగంట్యాడ మండల పరిధిలోనే రోజుకి సుమారు 130 మంది వరకూ చికిత్స పొందుతున్నారు. వీరు కాకుండా జలుబు, దగ్గు వంటి వ్యాధులతో బాధపడే వారి సంఖ్య పెరుగుతోందని అధికారులు తెలుపుతున్నారు.

వారం రోజులుగా జ్వరం



నేను వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాను. రోజూ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు వస్తున్నాను. పరీక్షలు చేస్తున్నారు.. మందులు ఇస్తున్నారు. జ్వరం మాత్రం తగ్గడం లేదు. ఒళ్లునొప్పులు భరించలేని విధంగా ఉన్నాయి. అధికారులు, పాలకులు స్పందించి మెరుగైన వైద్య చికిత్స అందించేలా చూడాలి.

–ఓ.తవిటమ్మ, దయాల్‌నగర్, పెదగంట్యాడ.

పనికి వెళ్లలేని పరిస్థితి



కూలికెళ్తే గానీ పూటగడవని పరిస్థితి నాది. జ్వరం కారణంగా ఆస్పత్రుల చుట్టూ తిరిగే సరికే సరిపోతోంది. గత ప్రభుత్వ హయాంలో మలేరియా విభాగం అధికారులు ఇంటింటికీ వచ్చి జ్వరాల గురించి ఆరా తీసేవారు. ఇప్పుడు మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. మెరుగైన వైద్యం చేయించుకునే స్తోమత లేదు. అధికారులు స్పందించి గత ప్రభుత్వం మాదిరిగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి.

–పి.మల్లికార్జునరావు, పెదగంట్యాడ.

జాగ్రత్తలు పాటించాలి



వర్షాలు పడుతున్న నేపథ్యంలో వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వ్యాధులు విజృంభిస్తున్నాయి. జ్వరాల సంఖ్య పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో అందరూ జాగ్రత్తలు పాటించాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇళ్లల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జ్వరం వస్తే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ ప్రదీప్‌ప్రసాద్‌రాజా,దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి



గాజువాక లంకామైదానంలో లక్ష చీరలతో ఏర్పాటు చేసిన గణపతి నిమజ్జనం శనివారం సాయంత్రం అట్టహాసంగా జరిగింది. ఈ అపురూప ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

జీవో 296 పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

పెదగంట్యాడ: జీవో నెంబర్ 296 కింద జారీ చేసిన పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభించామని తహసీల్దార్ అమల తెలిపారు. అర్హులై ఉండి గతంలో దరఖాస్తు చేసుకోని వారు సమీప సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే 2019 అక్టోబర్ 10కి ముందు కొండపోరంబోకు తదితర ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఇంటి పన్ను, కరెంటు బిల్లు చెల్లిస్తున్న వారు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు



సంకట మోచన గణపతిని దర్శించుకుంటున్న మహిళలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలో నడుపూరులోని సంకట మోచన గణపతి ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ముగింపు వేడుకలను పురస్కరించుకొని ఆలయ అర్చకుడు వాసుదేవశర్మ పర్యవేక్షణలో మహాపూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామిఉత్సవమూర్తిని మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ అధ్యక్షుడు మంత్రి నర్సింహమూర్తి, జయంతి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో మంత్రి రాజశేఖర్, మంత్రి శంకరనారాయణ, నీరుకొండ రామచంద్రరావు, కులుకూరి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవకు గుర్తింపు

- గజేంద్రరావును వరించిన గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న సామాజిక సేవా కార్యకర్త గుడే సుశీలా గజేంద్రరావు

అగనంపూడి: సామాజిక సేవాకార్యకర్త, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఉక్కు మాజీ అధికారి గుడే సుశీలా గజేంద్రరావు సేవలకు గుర్తింపు లభించింది. హైదరాబాద్‌లోని కేంబ్రిడ్జి డిజిటల్ విశ్వవిద్యాలయం ఇటీవలహైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు గౌరవడాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 16 ఏళ్లుగా సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 70 మందికి రూ. 200 వంతున పింఛన్ అందించేవారు. తర్వాత ట్రస్ట్‌ను విస్తరించి పింఛన్‌తోపాటు పేదలు, క్షతగాత్రులు, మృతుల కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందించే కార్యక్రమం ప్రారంభించారు. ప్రస్తుతం ప్రతీనెలా పది నుంచి 15 కుటుంబాలకు ఆర్థిక సహాయం, నిత్యావసర సరకులు అందించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ సేవలను మెచ్చుకున్న కేంబ్రిడ్జ్ డిజిటల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. కార్యక్రమంలో యూనివర్సిటీ ఉన్నతాధికారులు, అతిథులు పాల్గొన్నారు.

ఆ స్తంభం తొలగించడం మరిచారా?

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- రాత్రి వేళల్లో ప్రమాదాలు



అగనంపూడి నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వచ్చే మార్గంలో ఇనుప స్తంభం

అగనంపూడి: అగనంపూడి నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వచ్చే మార్గంలో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు గతంలో ఏర్పాటు చేసిన ఇనుప స్తంభం ఇప్పుడు రహదారి ఇరుగ్గా మారడానికి కారణమైంది. దీంతో రాత్రి వేళల్లో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ స్తంభానికి రెండు వైపులా రహదారి విస్తరించి ఉండగా, ఇక్కడే కుదించుకుపోవడంతో గమనించని వాహనచోదకులు వేగంగా వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు.

ఇదీ పరిస్థితి

టోల్‌గేటు నుంచి తప్పించుకోడానికి భారీ వాహనాలు ఈ మార్గంలోకి ప్రవేశించడంతో వాటిని కట్టడి చేయడానికి ఎన్‌హెచ్‌ఏఐ సహకారంతో రైల్వే అధికారులు ఇనుప స్తంభాలు ఏర్పాటు చేసి వాహనాల ప్రవేశాన్ని నియంత్రించారు. తర్వాత ఈ మార్గంలోకి భారీ వాహనాల రాకపోకలను పోలీసులు నియంత్రించడంతో ఒక పక్క స్తంభంతోపాటు అడ్డంగా ఏర్పాటు చేసిన ఇనుప హైట్‌బారియర్ తొలగించారు. రైల్వే అధికారులు రహదారిని విస్తరించినా ఆ స్తంభాన్ని తొలగించకుండా అలాగే వదిలేయడంతో ఇక్కడికి వచ్చేటప్పటికి బస్సు వంటి పెద్ద వాహనం కూడా వెళ్లి రావడానికి అవకాశం లేకుండా పోయింది. అధికారులు స్పందించి మధ్యలో ఉన్న ఇనుప స్తంభాన్ని తొలగించి రహదారి విస్తరణ పనులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



నారాయణమ్మ కుటుంబానికి రూ.30వేల నగదు, నిత్యావసరాలు అందిస్తున్న ప్రతినిధులు

అగనంపూడి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గుడే నారాయణమ్మ కుటుంబానికి అగనంపూడికి చెందిన శ్రీపద్మ మార్కండేయ (పద్మశాలి) సేవా సంఘం చేయూత నందించింది. పెదమడకలో మృతురాలి కుటుంబ సభ్యులకు శనివారం సేవా సంఘం ప్రతినిధులు రూ.30వేల నగదు, మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరకులు అందించారు. రాష్ట్ర చేనేత సంఘం కన్వీనర్ పప్పు రాజారావు మాట్లాడుతూ పద్మమార్కండేయ సేవా సంఘం కులాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా కార్యక్రమంలో పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షుడు కొలిపాక అప్పారావు, ప్రతినిధులు గుడే సుశీలా గజేంద్రరావు, పొన్నగంటి నాగేశ్వరరావు, గంధోలి నరసింగరావు, రామారావు, డాక్టర్ రాజు, పచ్చారి రామలక్ష్మణ, విందుల చిరురాజు, కరణం సన్ని, గుడే చంటి, మణికంఠ పాల్గొన్నారు.

ఇందిరా ప్రియదర్శినికి అభినందన

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి బీసీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఇందిరా ప్రియదర్శిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె తోటి ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

గణపతిని పూజిస్తే విజయాలు



గణేష్‌నగర్‌లో అన్నసమారాధన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న తిప్పల నితీష్ రెడ్డి తదితరులు

కూర్మన్నపాలెం: ఆది దేవుడు వినాయకుడిని ఆరాధించడం వల్ల విఘ్నాలు తొలగిపోతాయని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పేర్కొన్నారు. జీవీఎంసీ 87వ వార్డు గణేష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన గణేశుడిని శనివారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని నాగిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డగోవింద్, ప్రగడ శ్రీనివాస్, దుగ్గపు దానప్పలు, సీహెచ్. వెంకటరమణ, ఆనంద్‌కుమార్, తాతరావు తదితరులు పాల్గొన్నారు.

- వడ్లపూడి కాలనీలో జరిగిన భారీ అన్నసమారాధనలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కోమటి శ్రీనివాసరావు పాల్గొని భక్తులకు ప్రసాదాలను అందజేశారు. ఆయనతో పాటు నాగరాజు, కుమార్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలు

పెదగంట్యాడ: అన్నిదానాల్లో కంటే అన్నదానం మిన్న అని గాజువాక వర్తక సంఘం అధ్యక్షుడు తిప్పల నితిష్‌రెడ్డి అన్నారు. పిట్టవారి వీధిలో పిట్టవారి సహకారంతో శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని నితీష్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి రమణారెడ్డి, పూతి తాతారావు, పిట్ట బాంబు, నాగేశ్వరరావు, గురునాథ్ పాల్గొన్నారు.

- 76వ వార్డులో కాదులూరి కనకరావు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనను వార్డు అధ్యక్షుడు మంత్రి శంకరనారాయణ ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

ధ్యానరత్న నంద ప్రసాద్ సేవలు ఎనలేనివి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వనిత

పెదగంట్యాడ: బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశయాలకు అనుగుణంగా ధ్యాన ప్రచారమే శ్వాసగా నంద ప్రసాదరావు సేవలు అందించారని అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రం అధ్యక్షుడు మీసాల శివగణేశ్వరరావు అన్నారు. ధ్యాన రత్న నంద ప్రసాదరావు నాలుగో ధ్యాన స్మృతి దినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద ప్రసాద్ సొసైటీకి ఎన్నో సేవలందించారని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరినీ ధ్యానులుగా, శాకాహారులుగా తీర్చిదిద్దాలని వారి కుటుంబం ఎంతో కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో సభ్యులు బి. అప్పారావు, వనిత, చిన్నారావు, నీలకంఠం, దేవిక, ధనలక్ష్మి, విష్ణుకుమార్, లక్ష్మి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బహుజనగణమన పుస్తకావిష్కరణ



బహుజనగణమన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

గాజువాక: బీసీల ఆర్థిక, రాజకీయ, సామాజిక హక్కుల కోసం చేపడుతున్న పోరాటానికి అన్ని వర్గాల్లోని ప్రగతిశీలవాదులు, కవులు, రచయితలు మద్దతు ప్రకటించాలని పలువురు వక్తలు కోరారు. కవి జూలూరు గౌరీ శంకర్ రచించిన బహుజనగణమన దీర్ఘకావ్యం పుస్తకాన్ని స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కాలేజీలో శనివారం ఆవిష్కరించారు. కవి జూలూరు గౌరీ శంకర్ మాట్లాడుతూ అస్తిత్వ ఉద్యమాలు, దళిత, బహుజన ఉద్యమాలు, వాటి ఆవశ్యకత తీరు తెన్నులను వివరించారు. రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర, తెలంగాణ అస్తిత్వాలను విశ్లేషించారు. బహుజనగణమన దీర్ఘకావ్యం మనుషులను చీల్చేది కాదని, దేశ సమైక్యతను కోరే అట్టడుగు కులాల సామాజిక న్యాయపోరాటమని అన్నారు. తమది కుల పోరాటం కాదని, సమానత్వం, సమన్యాయం, సామాజిక న్యాయం కోసం తలపెట్టిన ఉద్యమమని అన్నారు. బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గోడి నర్సింహాచారి మాట్లాడుతూ జూలూరు రాసిన బహుజనగణమన నూతన అధ్యాయానికి తలుపులు తెరిచిందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దలను గౌరవిస్తే ఉజ్వల భవిష్యత్తు



బామ్మ, తాతయ్యలకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

గాజువాక: బామ్మ, తాతయ్యల దినోత్సవాన్ని స్థానిక రవీంద్రభారతి స్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల కుటుంబ సభ్యుల ఫొటోలతో ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేశారు. బామ్మలు, తాతయ్యలకు విద్యార్థులతో పాదపూజ జరిపించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.ఆర్.కవిత మాట్లాడుతూ బామ్మలు, తాతయ్యల గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.